

కౌలు రైతులకు నగదు జమ

ప్రజాశక్తి -పాడేరు: జిల్లాలో 154 మంది కౌలు రైతుల ఖాతాలకు రూ.11లక్షల 55 వేలను ప్రభుత్వం జమ చేసిందని జాయింట్ కలెక్టర్ జె. శివ శ్రీనివాసు స్పష్టం చేసారు. శుక్రవారం తాడేపల్లి సి.ఎం. క్యాంపు కార్యాలయం నుండి కౌలు రైతుల పెట్టుబడి సాయం విడుదల కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారాన్ని కలెక్టర్ కార్యాలయం నుండి వీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పెట్టుబడి సాయాన్నికౌలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



చెక్‌ను ఇస్తున్న అధికారులు

అనంతరం రైతులకు నమూనా చెక్కును పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షురాలు ఎం.సరస్వతి, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.బి. ఎస్.నంద్, జిల్లా ఉద్యానవన అధికారి రమేష్ కుమార్‌రావు, వ్యవసాయ సలహా మండలి సభ్యులు కన్నాపాత్రుడు తదితరులు పాల్గొన్నారు.


పెదబయలులు పోస్టర్ ఆవిష్కరిస్తున్న సురేంద్ర, నేతలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన..

ధరలను తగ్గించాలి

-సిపిఎం సమర భేరిలో ఆ పార్టీ నేతల డిమాండ్ -గ్రామ సచివాలయాల వద్ద నిరసనలు



అనంతగిరి మండలంలో.. గంగరాజు, నేతల నిరసన

ప్రజాశక్తి-యంత్రాంగం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తోన్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఎం సమర భేరి మన్యంలో కొనసాగింది. ఈ సందర్భంగా సిపిఎం నేతలు పలు గ్రామాల్లో పర్యటించి కరపత్రాలు పంపిణీ చేశారు.

పెదబయలురూరల్:మండలంలోని అడుగులపుట్ పంచాయతీ వడ్డేపుట్ గ్రామంలో సీపీఎం నేతలు పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె సురేంద్ర మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు, బడా పెట్టుబడిదారులకు లక్షల కోట్ల రూపాయలు రాయితీలు ఇస్తూ పేద ప్రజలపై పన్నుల భారాన్ని మోపుతుందన్నారు. ఈ విధానాలను జగన్ ప్రభుత్వం వ్యతిరేకించకుండా మోడీకి భజన చేస్తూ ఆ విధానాన్నే శతశాతం అమలు చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ రంగంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి నిరుద్యోగ సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు.నిత్యావసర సరుకులు అధిక ధరలను తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు కె.సర్భన్న బి.గంగాధర్, కె.నర్సయ్య రాజు,తదితరులు పాల్గొన్నారు

హుకుంపేట :సిపిఎం సమర భేరి లో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పి.అప్పలనరస మండలంలోని గడికించుమండ పంచాయతీ గడ్డి మర్రి గ్రామంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యురాలు ఎస్.హైమా, నాయకులు కృష్ణారావులతో కలిసి పర్యటించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై ఇంటికి తిరిగి సంతకాల సేకరణ చేపట్టారు. అనంతరం అప్పలనర్స మాట్లాడుతూ, బిజెపి, వైసిపి ప్రభుత్వాలను గద్దెదించాలని పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి వి.లక్ష్మణ్ రావు, పడల్, అప్పారావు పాల్గొన్నారు.

పాడేరు:కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ ఛార్జీల పేరుతో ప్రజలపై భారం మోపి దోపిడి చేస్తున్నాయని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనరస ధ్వజమెత్తారు. చింతలవీధి సచివాలయంకు ప్రదర్శనగా వెళ్లి సచివాలయం అధికారికి అర్జీలు సమర్పించారు. విద్యుత్ బిల్లులను దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం జరిగిన సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి పి అప్పల నర్స మాట్లాడుతూ, ట్రూ ఆఫ్ చార్జీ, స్మార్ట్ మీటర్ పేరుతో ప్రజలపై భారాన్ని వైసీపి ప్రభుత్వం మోపుతుందన్నారు. అధిక విద్యుత్ బిల్లుల నెపాన్ని చూపి అసర చేయూత పథకం రద్దు చేశారన్నారు. .మినుములురు సచివాలయంలో పార్టీ మండల కార్యదర్శి ఎల్. సుందర రావు మాట్లాడారు.గుత్తుల పుట్టు సచివాలయం వద్ద సిపిఎం మండల నాయకులు కె.సత్యనారాయణ, చిట్టిబాబు మాట్లాడారు.

అరకులోయ రూరల్: మండలలోని పెదలబుడు, పద్మాపురం, మాడగడ, చొంపి, సిరగాం సచివాలయ కేంద్రాల వద్ద కరెంటు బిల్లులను సిపిఎం నేతలు దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమమహేశ్వరరావు, నాయకులు పొద్దు బాలదేవ్, మండల కార్యదర్శి కె.రామారావు, జిల్లా కమిటి సభ్యులు వి.విజయ మాట్లాడుతూ, నిత్యావసర సరుకుల ధరలు రోజురోజుకు పెంచుతున్నారని విమర్శించారు. ఆదివాసి స్పెషల్ డిఎస్సి నోటిఫికేషన్ జారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె జగన్నాథం, మగ్గన్న, పద్మాపురం ఉప సర్పంచ్ జె భగత్‌రాం, చొంపి వార్డు సభ్యులు కోగేశ్వరరావు, హరి, రాము సహదేవ్, కళ్యాణ్, సత్యారావు, జగనాథం తదితరులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: కేంద్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ స్థానిక సిపిఎం మండల ప్రధాన కార్యదర్శి ఎస్‌బి పోతురాజు ఆధ్వర్యంలో మండలంలోని అరకు పంచాయతీ సచివాలయ అధికారులకు ఆ పార్టీ నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పోతురాజు మాట్లాడుతూ, జీవో 3కు చట్టబద్ధత తీసుకొచ్చి ఖాళీగా ఉన్న బ్యాక్ లాగ్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల నాయకులు పి సురేష్ కుమార్, పి ధర్మ, వి సింహాద్రి, పి సారేంద్ర తదితరులు పాల్గొన్నారు.


అరకులోయలో...

అనంతగిరి: మండలంలోని టోకురు, పైనంపాడు సచివాలయాల వద్ద సిపిఎం నేతలు ధర్నా చేపట్టి అనంతరం సెక్రటరీలకు వినతి పత్రాలు అందజేశారు. సిపిఎం రాష్ట్ర నాయుడు దడల .సుబ్బారావు, స్థానిక జెడ్పిటిసి దీసరి .గంగరాజు మాట్లాడుతూ, జి.ఓ 3 రిజర్వేషన్‌కు చట్టబద్ధత కల్పించి ఆదివాసీ స్పెషల్ డిఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. పివిటిజిలకు రేషన్ కార్డులు, అంత్యోదయ కార్డులు మంజూరు చేయాలన్నారు. విద్యుత్ చార్జీలు, అధిక ధరలు అరికట్టాలన్నారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పోస్టులను గిరిజనులతో భర్తీ చేయాలన్నారు. భాష వాలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో గెమ్మెల దేవన్న సివేరి కొండలరావు, నందల రామరాజు, నరాజీ సురేష్ పాల్గొన్నారు


కొయ్యూరులో....

ముంచింగిపుట్టు:సీపీఎం ఆధ్వర్యంలో సచివాలయల అధికారులకు ప్రజా సమస్యలపై వినతిపత్రాలు సమర్పించామని మండల కమిటీ సభ్యుడూ ఎం.ఎం.శ్రీను తెలిపారు. ఈ కార్యక్రమంలో యస్‌ఈ శ్వరి, మురళి కె.నరసయ్య గిరిజనులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయాల వద్ద నిరసనలు

చింతూరు:అధిక ధరలు, విద్యుత్ ఛార్జీలకు వ్యతిరేకంగా, నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పనకు స్పెషల్ డిఎస్‌సి ప్రకటించాలని, స్థానిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మండలంలోని తుమ్మల, కుమ్మూరు గ్రామ సచివాలయాల వద్ద శుక్రవారం ధర్నాలు నిర్వహించారు. అనంతరం ఆయా పంచాయతీల కార్యదర్శులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ వేక రాజ్‌కుమార్ మాట్లాడుతూ జిఒ 3ను పునరుద్ధరించాలని, బోయవాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చే 52 జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ముట్టం రాజయ్య, సవలం నారాయణ, సోడే లెనిన్, ముర్రం పిడగయ్య, సురేష్, మడకం శంకర్, వేక గోవిందు, మడకం బ్రహ్మయ్య, కురసం రాములమ్మ, భద్రమ్మ, బొగ్గ వెంకమ్మ, కుంజ హరీష్, లెనిన్ పాల్గొన్నారు.

కూనవరం : మండలంలోని కూనవరం, కూటూరు, చిన్నఆర్కూర్ గ్రామ సచివాలయాల ఎదుట సీపీఎం ఆధ్వర్యాన ధర్నాలు చేపట్టారు. కూనవరం సచివాలయం వద్ద సిపిఎం జిల్లా నాయకులు మేకల నాగేశ్వరరావు మాట్లాడుతూ పోలవరం నిర్వాసితులకు పునరావాసం, ప్యాకేజీ కల్పించాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, నాయకులు తాళ్లూరి శ్రీనివాసరావు, తెల్లగానే నాగరాజు, వెంకన్న బాబు, జక్కుల వీరబాబు, సత్యనారాయణ పాల్గొన్నారు.

విఆర్.పురం : మండలంలోని ఒడ్డుగూడెం, రేఖపల్లి, రాజుపేట, రామవరం, జీడిగుప్ప, చిన్న మట్టపల్లి గ్రామ సచివాలయాల సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ మాట్లాడుతూ పోలవరం నిర్వాసితులకు కాంటూరు కాకి లెక్కలతో సంబంధం లేకుండా ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, ఇంటికో ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎంపిపి కారం లక్ష్మి, సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, సర్పంచ్‌లు వెట్టి లక్ష్మి, పులి సంతోష్ కుమార్, పూనెం సరోజిని, సవలం మారయ్య, కారం బుచ్చమ్మ, ఎంపిటిసి పూనెం ప్రదీప్ కుమార్, మాజీ ఎంపిటిసి గూటాల శ్రీనివాసరావు, పార్టీ నాయకులు పంకు సత్తిబాబు, కుంజా నాగిరెడ్డి, వడ్లది రమేష్, కారం సుందరయ్య, గుండెపూడి లక్ష్మణరావు, కాంతారావు, నెరబైన రాజు, తాతబాబురెడ్డి, వాళ్ల కృష్ణారెడ్డి, ఖాదర్‌బాబు, ప్రకాష్‌రావు, నూకరాజు, వీర్ల నాగేశ్వరరావు, చంద్రరావు, రామచంద్ర, పాల్గొన్నారు.

ఎటపాక : మండలంలోని లక్ష్మీపురం, నెల్లిపాక, కన్నాయిగూడెం, గుండాల, గన్నవరం సచివాలయాల వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై ధర్నాలు చేసి, వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి ఐ.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పోలవరం నిర్వాసితులకు అన్యాయం చేస్తున్నాయన్నారు. ఆకిశెట్టి రాము, బేతి మంగయ్య, రాసాల వెంకటేశ్వర్లు, నూతలపాటి సుధాకర్, తోట శ్రీను పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : మండలంలోని లోదొడ్డి, వాతంగి సచివాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, లోదొడ్డి సర్పంచ్ లోతా రామారావు లోదొడ్డి సచివాలయంలో నెల రోజులుగా నెట్ సౌకర్యం లేక పనులన్నీ నిలిచిపోయాయని, సేవలు పునరుద్ధించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మేలిన రమేష్, జర్త రాజు, గంగరాజు, పి.సత్యనారాయణ, కె.అప్పలరాజు, గోము బుల్లబ్బాయి, మణుగుల రాజు, మేలిన మురళి, శ్రీను, సురేష్, శివ పాల్గొన్నారు.

కొయ్యూరు : మండల కేంద్రంలోని కొయ్యూరు గ్రామ సచివాలయంలో సిపిఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు ఎస్ సూరిబాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.


చింతూరులో...

ఆదివాసీలను మోసం చేయడంలో..

వైసిపి, బిజెపి ప్రభుత్వాలు దొందూ దొందే

-మన్యంలో రిజర్వేషన్ల రద్దుకు కుట్ర -జిఒ 3 ఆర్డినెన్స్ జారీపై నిర్లక్ష్యం -ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్న యువత

ప్రజాశక్తి-పాడేరు టౌన్: **ఆదివాసీలను మోసం చేయడంలో వైసిపి, బిజెపి దొందు దొందే. పిఎం మోడీ మెప్పుకోసం సిఎం జగన్ రాష్ట్ర గిరిజనుల ప్రయోజనాలను తాకట్టు పెట్టి ఆదివాసీలను బలి చేస్తున్నారు. ఆదివాసీల సంపద దోచుకునేందుకు ఆదివాసీల రిజర్వేషన్లను సమూలంగా నిర్మూలించే స్థితికి వైసిపి, బిజెపి ప్రభుత్వాలు దిగ జారుతున్నాయి.**

దేశంలో, రాష్ట్రంలో ఆదివాసీల రిజర్వేషన్లపై వరుసగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దాడులు పెరిగి పోయాయి. ఆదివాసీల ఉద్యోగావకాశాల జిఒ-3ను 2020 ఏప్రిల్ 22న రద్దు చేస్తూ సుప్రీంకోర్టు తీర్పుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనులకు అన్యాయం జరగకుండా తీసుకున్న చర్యలు శూన్యం. ఆదివాసి ప్రాంత ఉద్యోగాలను గిరిజనేతరులు దోచుకుంటుంటే ప్రభుత్వాలు కనీసం పట్టించుకో లేదు.గిరిజనుల రిజర్వేషన్లను నిర్వీర్యం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోటాపోటీగా అడుగులు వేస్తోంది. గిరిజనుల రిజర్వేషన్ల ప్రయోజనాలను నిలబెట్టే యత్నాల్లో వైసిపి, బిజెపి నిర్లక్ష్యం చూపుతోంది. యావత్ గిరిజనులంతా రిజర్వేషన్ల ప్రయోజనాల రక్షణకు ఆందోళనలు చేస్తున్నా.. ప్రభుత్వాలు నిర్లక్ష్యం చూపుతుండటంతోనే గిరిజనుల రిజర్వేషన్లకు, ప్రయోజనాలకు తీవ్ర ముప్పుగా మారింది. దీంతో ఉన్నత విద్యను అభ్యసించిన అల్లూరి జిల్లాలోని సుమారు 20వేల మంది గిరిజన యువతకు ఉద్యోగాలు లేకుండా రోడ్డున పడ్డారు.

స్థానిక ఆదివాసీ యువత తీవ్ర నష్టం

అల్లూరి జిల్లా ఏజెన్సీ ప్రాంతాల్లో ఇప్పటికీ గురుకులం, ఏకలయ్య, మోడల్ స్కూల్, వైద్య, రంగాల్లో సుమారు 3వేల ఉద్యోగాలను గిరిజనేతరులతో భర్తీ చేయడంతో స్థానిక ఆదివాసీ యువత తీవ్రంగా నష్టపోయారు. 650 టీచర్ పోస్టులు, 100 ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం పోస్టులు రద్దు చేశారు. తక్షణమే నూరు శాతం ఉద్యోగ రిజర్వేషన్ కు చట్టబద్ధత కల్పించాలి.

ప్రస్తుత బిజెపి, వైసిపి ప్రభుత్వాల హయాంలో ఆదివాసీల రిజర్వేషన్ల ఫలాలు ఏ మేరకు అమలైందనే ప్రశ్నకు ఆ పార్టీల నాయకులే నోరు వెళ్ళబెడుతున్నారు. గిరిజనుల రిజర్వేషన్ల ఫలాలు, అభివృద్ధి మాట అటుంచి ఉన్నవి పోతున్నాయని విమర్శిస్తున్నారు.

రిజర్వేషన్లు నిర్వీర్యమయ్యేలా..

గిరిజనుల ఉద్యోగ అవకాశాల జిఒ-3 సుప్రీంకోర్టు కొట్టి వేయడంతో గిరిజనులకు రావాల్సిన ఉద్యోగాలు గిరిజనేతరులు పొందుతున్నారు. జిఒ-3 కోర్టు కొట్టి వేయక ముందు గిరిజన ప్రాంత ఉపాధ్యాయ ఉద్యోగాలను శతశాతం గిరిజనులకే కేటాయించేవారు. ప్రస్తుతం జిఒ కోర్టు కొట్టి వేయడంతో పరిస్థితి తారుమారైంది. రిజర్వేషన్ ఫలాలు అందిపుచ్చుకుని కొంతమంది మాత్రమే ఉద్యోగ అవకాశాలు పొంది జీవిస్తున్నారు. జిఒ-3 రిజర్వేషన్ కాపాడడంలో నిర్లక్ష్యం గిరిజనులను మరింత వెనుకబాటుకు గురి చేయడమే.

జిఒ-3 రిజర్వేషన్ పై చర్యలేమిటో..

షెడ్యూల్ ప్రాంతంలో ఆదివాసి గిరిజనులకు 100 శాతం రిజర్వేషన్లకు సంబంధించి కీలకమైన జిఒ-3ను సుప్రీంకోర్టు రద్దు చేసింది. గిరిజనుల ఉద్యోగాలకు అండగా ఉన్న జిఒ-3 రద్దుతో గిరిజనుల మనుగడకే ప్రమాదం ఏర్పడింది. ఉపాధ్యాయ ఉద్యోగాలను గిరిజనులు కోల్పోవాల్సిన పరిస్థితి వచ్చింది. ఇది గిరిజనాభివృద్ధిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. జిఒ-3 రిజర్వేషన్ కోసం అవసరమైతే కొత్త చట్టాన్ని తీసుకురావాలని, న్యాయపరంగా అన్ని చర్యలు తీసుకోవడంతో పాటు కోర్టు తీర్పుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలని గిరిజన సలహా మండలి (టిఎసి) రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరినా ఆ దిశగా నేటికీ ఎటువంటి చర్యలు చేపట్టలేదు. గిరిజనులకు న్యాయం చేయడానికి కొత్త చట్టాన్ని తీసుకొచ్చే ప్రక్రియపై కసరత్తు చేయాలి. అలా కాకుండా రివ్యూ పిటిషన్ వేసి చేతులు దులి పేసుకుంది. గిరిజనుల హక్కులు, చట్టాల ప్రయోజనాల రక్షణకు అంత శ్రద్ధ చూపడం లేదు. జిఒ-3 రిజర్వేషన్ కాపాడటంలో వైసిపి ప్రభుత్వం సరైన ప్రయత్నం చేయడం లేదు. జిఒ-3ను కొట్టేయడానికి కారణాలను న్యాయనిపుణుల నుంచి తెలుసుకుని జిఒ-3 రిజర్వేషన్ యధాతథంగా అమలు చేసేందుకు తక్షణమే ఆర్డినెన్స్ తీసుకువచ్చి పునరుద్ధరించాలని, ప్రత్యేక చట్టం తీసుకురావడం ద్వారానే గిరిజనులకు న్యాయం జరుగుతుందని గిరిజనులు కోరుతున్నా వైసిపి, బిజెపి ప్రభుత్వాలు పట్టించుకోలేదు. జిఒ-3 రిజర్వేషన్ ప్రయోజనాల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును నిరసిస్తూ అనేక రకాల ఆందోళనలు, నిరసనలు చేస్తున్నా గిరిజనుల మనుగడ సమస్యపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నేటికీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఇప్పటికైనా షెడ్యూల్ ప్రాంతంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలన్నీ గిరిజనులకే చెందేలా 100 శాతం రిజర్వేషన్ కల్పించే జిఒ-3 రిజర్వేషన్ పై సమగ్ర చట్టం చేయాలని, దాని ప్రయోజనాలు కొనసాగేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

నిమ్మకు నీరెత్తినట్లుగా ప్రభుత్వాలు..

జిఒ-3 ప్రయోజనాలు కాపాడటానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకోవాలి. జిఒ-3 రిజర్వేషన్ ప్రయోజనాలకు తక్షణం ఆర్డినెన్స్ జారీ చేయాలి. జిఒ-3 సుప్రీం కోర్టు కొట్టివేయడం వల్ల గిరిజన ప్రాంతంలో భర్తీ చేసే 100 పోస్టుల్లో గిరిజనలకు కేవలం 6 మాత్రమే దక్కే పరిస్థితి ఏర్పడింది. జిఒ రద్దుపై ప్రభుత్వాలు నిమ్మకు నేరేతున్నట్లు ఉండడం దారుణం.



కిల్లో సురేంద్ర,
గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ఉద్యోగాలన్నీ ఆదివాసులకే చెందాలి

షెడ్యూల్ ప్రాంతంలో అన్ని హక్కులు ఆదివాసీలకు మాత్రమే హక్కులుంటాయన్న విషయాన్ని పరిగణలోకి తీసుకోకుండా జిఒ-3 ఏకపక్షంగా రద్దు చేశారు. జిఒ-3 రద్దు చేస్తూ సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు ఆదివాసీల భవిష్యత్తుకు గొడ్డలి పెట్టుగా మారింది. దీనివల్ల ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులకు భంగం వాటిల్లుతోంది.



పి.అప్పలనర్స
సిపిఎం జిల్లా కార్యదర్శి

బిఇడిలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-రంపచోడవరం

2023-25 విద్యా సంవత్సరంలో ఏజెన్సీ షెడ్యూల్డ్ ప్రాంత గిరిజన పట్టభద్రుల సంక్షేమార్ధం భద్రాచలం ఐటిడిఎ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ప్రత్యేక గిరిజన బిఇడి కళాశాలలో రెగ్యులర్ బిఇడి కోర్సులో (2 సంవత్సరాలు) ప్రవేశం నిమిత్తం ఏజెన్సీ షెడ్యూల్డ్ ప్రాంత గిరిజన పట్ట భద్రుల నుండి నేరుగా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన షెడ్యూల్డ్ ప్రాంతానికి చెందిన గిరిజన పట్టభద్రులై ఉండాలని, డిగ్రీ పాసై కనీసం 40 శాతం మార్కులు సాధించి ఉండాలని పేర్కొన్నారు. సంబంధిత డిగ్రీ పరీక్షలో సాధించిన మెరిట్‌ని బట్టి ఎంపిక జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ నియమాల ప్రకారం మహిళలకు ప్రత్యేక కేటగిరి కింద సీట్లు కేటాయించబడ్డాయని వెల్లడించారు. పూర్తి మెరిట్ ఆధారంగా ఎంపిక జరుగుతుందన్నారు. ప్రాస్పెక్టస్, దరఖాస్తులు ఉచితంగా పొందుటకు రంపచోడవరం ఐటిడిఎ ఉప సంచాలకుల కార్యాలయంలో ఈ నెల 1 నుండి ప్రతి రోజూ ఉదయం 10గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పొందవచ్చని పేర్కొన్నారు. దరఖాస్తు పోస్ట్ ద్వారా పొందగోరు అభ్యర్థులు తమ సొంత చిరునామా గల కవర్ (రూ.10/- స్టాంపుతో) ప్రిన్సిపాల్, గిరిజన విద్యా కళాశాల, భద్రాచలం నుండి పొందవచ్చని తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులు ఈ నెల 20 నాటికి కళాశాలకు సమర్పించాలని కోరారు.

రీ సర్వేలో తప్పుల్లేకుండా అప్‌లోడ్ చేయాలి

సర్వే శాఖ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ కుమారి

ప్రజాశక్తి రంపచోడవరం

ఏజెన్సీలో జగనన్న భూ హక్కు - భూ రక్ష ప్రోగ్రామ్ ద్వారా రీ సర్వే చేసిన భూములన్నింటికీ రికార్డుల్లో తప్పులు లేకుండా అప్‌లోడ్ చేయాలని రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ సర్వే కెజియు.కుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే, మండల, గ్రామ సచివాలయాల సర్వేయర్లతో రీ సర్వే స్పెషలాఫీసర్ ఉదయ భాస్కర్, డిఎస్‌ఎల్‌ఓ మోహనరావు, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే కె.దేవేంద్రుడుతో కలిసి ఆమె శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కుమారి మాట్లాడుతూ జగనన్న భూ హక్కు కార్యక్రమం ద్వారా ఏడు మండలాలలో ఇప్పటివరకు 256 గ్రామాలలో సర్వే పూర్తయిందని తెలిపారు. ఈ సర్వే చేసిన భూములకు రికార్డులు తయారు చేయడంలో ఏమైనా సమస్యలున్నాయా? అని ఆరా తీశారు. రికార్డులు తయారీలో టెక్నికల్ సమస్యలుంటే వెంటనే మండల పరిధిలోని అధికారులను తెలియజేసి పరిష్కరించుకోవాలని, తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సర్వే చేసిన భూములకు సంబంధించి వచ్చిన సమస్యలను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సల్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సర్వే ఆఫ్ ఇన్‌స్పెక్టర్లు రాజశేఖర్, బాబురావు, రవిశంకర్, నాగభూషణం, ఏడు మండలాల సర్వేయర్లు, వాటి పరిధిలోని గ్రామ సచివాలయాల సర్వేయర్లు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సర్వే శాఖ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ కుమారి

శ్రావణ శుక్రవారం పూజలో ఎంపీ దంపతులు

ప్రజాశక్తి -కొయ్యూరు

అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, శివప్రసాద్ దంపతులు శ్రావణ శుక్రవారం సందర్భంగా తమ స్వగృహంలో లక్ష్మీదేవికి కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వ్యవసాయదారులకు అన్ని పంటలు పండి సుఖ సంతోషాలతో ఉండాలని పూజలు చేసినట్లు చెప్పారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-రంపచోడవరం

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన రంపచోడవరం మండలం పెద్ద గెద్దాడ గ్రామ సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. రంపచోడవరం పోలీసుల కథనం ప్రకారం... మారేడుమిల్లి మండలం డివి.కోట గ్రామానికి చెందిన మడి కృష్ణ(35) బైక్‌పై వెళ్తుండగా, పెద్ద గెద్దాడ గ్రామ సమీపంలోకి వచ్చే సరికి వెనుక నుండి వచ్చిన గుర్తు తెలియని వాహనం కృష్ణ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కృష్ణకు తీవ్రగాయాలు కాగా, గమనించిన స్థానికులు వెంటనే 108కు సమాచారం అందించి, వైద్యం నిమిత్తం రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో రాజమండ్రి తరలిస్తుండగా మార్గమధ్యలో గోకవరం సమీపానికి వెళ్ళేసరికి కృష్ణ మతి చెందాడు. ఈ ఘటనపై రంపచోడవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


సంఘటనా స్థలంలో పడి ఉన్న కృష్ణ

మండలంలో వర్షం

ప్రజాశక్తి-కొయ్యూరు

మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాలలో శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఏకదాటిగా వర్షం కురిసింది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది పూర్తిస్థాయిలో వర్షపాతం లేనందున పంట పొలాలకు అరకొరగా నీరు ఉండటంతో రైతులు ఆందోళనలో ఉన్న సమయంలో ఈ వర్షం కాస్త ఊరటనిచ్చింది. ఈ వర్షం మెట్ట ప్రాంత పప్పు దినుసులు పంటలు వేసుకునేందుకు అనువుగా ఉంటుందని రైతులు అంటున్నారు. మొత్తంగా ఈ వర్షం రైతులకు మేలు చేస్తుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


కొయ్యూరులో కురుస్తున్న వర్షం



మాట్లాడుతున్న పిఒ అభిషేక్

ట్రెయినీ ఐఎఎస్‌లు గుర్తించిన సమస్యలను పరిష్కరిస్తాం

ప్రజాశక్తి-పాడేరు:చింతపల్లి మండలం తాజంగి, జి.కె. వీధి మండలం దుప్పలవాడ గ్రామాల్లో 2023 బ్యాచ్ శిక్షణ ఐఎఎస్ అధికారులు పర్యటించి గుర్తించిన సమస్యలను పరిష్కరిస్తామని ఐటిడిఏ పిఓ వి.అభిషేక్ స్పష్టం చేసారు. వారం రోజులు ఏజెన్సీలో పర్యటించిన ఐఏఎస్ అధికారుల బృందంతో ఐటిడిఏ కార్యాలయంలో శుక్రవారం ఐటిడిఏ పిఓ ముచ్చటించారు. దుప్పలవాడ గ్రామంలో పర్యటించిన ఏడుగురు ట్రెయినీ ఐఏ ఎస్ అధికారులు, తాజంగి గ్రామంలో పర్యటించిన ఏడుగురు ట్రైనీ ఐఏఎస్ అధికారుల బృందం ప్రతి స్పందన నివేధికలను పిఓకు సమర్పించారు. తాగునీటి సమస్యలు, బడిబయట పిల్లలు, రహదారి సదుపాయాలు, పర్యాటక ప్రాంతాల్లో ప్లాస్టిక్ నిషేధం, పర్యాటక ప్రాంతాలపై ప్రచారం, రైతు భరోసా, పి.ఎం. కిసాన్ అమలు, ఆరోగ్య సమస్యలు, వైద్య సేవలపై నివేధిక సమర్పించారు. నివేధికను పూర్తిగా పరిశీలించిన పిఓ వాటిని పరిష్కరిస్తామన్నారు. దుప్పలవాడ పంచాయతీ పరిధిలోని బండవీధి పాఠశాలను అభివృద్ధి చేస్తామని చెప్పారు. పలువురు శిక్షణ ఐఎఎస్ అధికారులు మట్లాడుతూ, ఏజెన్సీలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం బాగుందని చెప్పారు. అదే విధంగా తాజంగి పర్యాటక ప్రాంతం అద్భుతంగా ఉందని తాజంగి పరిసర ప్రాంతాల్లో ప్లాస్టిక్కు నిషేధించి, తగిన ప్రచారం చేస్తే పర్యాటక పరంగా మంచి అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం పాడేరులో నిర్మిస్తున్న వైద్య కళాశాల నిర్మాణపు పనులు పరిశీలించారు. అక్కడ నుండి బయలు దేరి అరకు వ్యాలీ వెళ్లారు. పద్మాపురం గార్డెన్, గిరి గ్రామ దర్శినినీ సందర్శిస్తారు.



మాట్లాడుతున్న కిడారి శ్రావణ్‌కుమార్

టీడీపీ గెలుపుతోనే ప్రజలకు భవిష్యత్తు

మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్

ప్రజాశక్తి అనంతగిరి: మండలంలోని వాలసి పంచాయతీ నిమ్మల పాడు గ్రామంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు అంబిడి. బుజ్జిబాబు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారంటీ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి కిడారి. శ్రావణ్ కుమార్, మాజీ ఎస్ టి ఎస్సీ సభ్యులు సివెరి. అబ్రహం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గ్రామస్తులు మహిళలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రజల సమస్యలు అడిగి తెలుసుకొని భవిష్యత్ గ్యారంటీ మేనిఫెస్టోను వివరించడం జరిగింది. అనంతరం నేతలు మాట్లాడుతూ, రాబోయే రోజుల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకివచ్చిన మరుక్షణమే మహిళలకు, రైతులకు ఇచ్చిన మేనిఫెస్టోలో హామీలను అమలు చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రజలు వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మాజీ జడ్పీ వైస్ ఛైర్మన్ అప్పారావు, ఆనంద్ మొస్య, జోగులు బిడ్డ .లక్ష్మణరావు, దయానిధి, సుందరరావు, నగేష్, లచ్చన్న, కామేష్, వెంకట్రావు, పండన్న , కిలో కృష్ణ పాల్గొన్నారు.

మన్యంలో కుండపోత వర్షం



పాడేరులో కురుస్తున్న వర్షం

పాడేరు టౌన్: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో శుక్రవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ వాతావరణం కొనసాగి ఆ తర్వాత ఒకసారి వాతావరణం మారిపోయింది. మధ్యాహ్నం రెండున్నర గంటల తర్వాత ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం మొదలైంది. సుమారు మూడు గంటల సేపు కురిసిన వర్షానికి పాడేరు పట్టణం తడిచి ముద్దయింది. పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో మురుగు నీరు ప్రధాన రహదారులపై ప్రవహించింది. పిఎంఆర్‌సి రోడ్డులో మురుగు కాలువలు సక్రమంగా లేకపోవడంతో ప్రధాన రహదారులపై నుంచి ప్రవహించిన నీరు టీచర్స్ క్వార్టర్స్ ఇళ్లలోకి చేరడంతో పలువురు ఇబ్బంది పడ్డారు. వాహన చోదకులు లైట్లు వేసుకుని ప్రయాణాలు సాగించారు.

ప్రజాశక్తి-అరకులోయ:పర్యాటక కేంద్రమైన అరకులోయ పరిసర ప్రాంతంలో శుక్రవారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. శుక్రవారం మధ్యాహ్నం వరకు తీవ్రమైన ఎండ వేడిమితో వాతావరణం వేసవి కాలాన్ని తలపింపజేసింది. దీంతో, పాటు శుక్రవారం ఉదయం కూడా దట్టమైన పొగ మంచుతో కమ్ముకుని శీతకాలన్నీ తలపించింది. సాయంత్రం 4 గంటల నుంచి ఏకధాటిగా కుండపోత వర్షం కురిసింది. గంటల తరబడి వర్షం కురవడంతో అరకులోయ లోని రోడ్లు వర్షపు నీటితో నిండి పోయాయి. కాలువలు పొంగి ప్రవహించాయి. ఆగస్టు నెల చివరి వరకు కూడా అంతంత మాత్రంగానే వర్షం కురవడంతో రైతులు వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయని ఆకాశం వైపు దిక్కులు చూస్తున్న తరుణంలో శుక్రవారం కురిసిన వర్షం ఉపశమనం కలిగించింది.



అరకులో కురుస్తున్న వర్షానికి పారుతున్న నీరు

స్పందనలో 78 వినతుల స్వీకరణ



వినతులు స్వీకరిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-పాడేరు: సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థలో శుక్రవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం - స్పందనకు 78 వినతులు అందాయి. జాయింట్ కలెక్టర్ జె. శివ శ్రీనివాసు, ఐటిడిఏ పిఓ వి అభిషేక్, ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారి వి.ఎస్. ప్రభాకరరావు, డిఆర్‌ఓ, పి.అంబేద్కర్, ఎస్.డి.సి, వి.వి.ఎస్. శర్మ వివిధ మండలాల నుండి వచ్చిన గిరిజన ప్రజల నుంచి ఈ అర్జీలను స్వీకరించారు. తాగునీటి సమస్యలు, అంగన్వాడీ కేంద్రాలు ఏర్పాటు, రహదారులు, వంతెనల నిర్మాణాలు, భూ సమస్యలు, అటవీ హక్కు మంజూరు కోసం ఎక్కువగా ఫిర్యాదులు వచ్చాయి. ఈ మేరకు అనంతగిరి మండలం గుమ్మకోట పంచాయతీ భీమవరం గ్రామస్తుడు రాకోటి అప్పలస్వామి విద్యుత్తు సదుపాయం కల్పించి ఉచిత వ్యవసాయ బోరు మంజూరు చేయాలని వినతి పత్రం సమర్పించారు.జి.మాడుగుల మండలం సొలభం పంచాయతీ వంజంగిపాడు గ్రామం మీదగా పెదపినపాలెం, గానుగుగోలు గ్రామం వరకు రోడ్డు నిర్మించాలని గ్రామస్తులు వినతిపత్రం సమర్పించారు.చింతపల్లి మండలం అంజలి శనివారం పంచాయతీ కొట్టగరువు గ్రామానికి సిసి రోడ్డు, కమ్యూనిటీ హాలు మంజూరు చేయాలని కె. భాస్కరరావు, ముంచంగిపుట్టు మండలం లక్ష్మీపురం గ్రామ పంచాయతీ ఉప్పెంగుల గ్రామానికి రోడ్డు, వంతెన నిర్మించాలని గ్రామస్తులు వి. సుబ్బారావు, గురుమూర్తి తదితరులు కోరారు. డుంబ్రిగుడ మండలం కురిడి గ్రామ పంచాయతీ గదబ గరువు, జి.బలియగుడ గ్రామాలకు కొత్త అంగన్వాడీ కేంద్రాలు మంజూరు చేయాలని ఎంపిటిసి వి.రాజేశ్వరి, సర్పంచ్ బి.లచ్చు వినతి పత్రం అందజేశారు.హుకుంపేట మండలం బూర్జ నుండి జాకర వలస మీదుగా తుంబవలస సల్గాని వరకు రోడ్డు నిర్మించాలని ఎంపిటిసి హరి కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి జమాల్ భాషా, గిరిజన సంక్షేమ శాఖ ఇఇ డివి. ఆర్.ఎం. రాజు, పంచాయతీ రాజ్ ఇఇలు కె. లావణ్య కుమార్, టి.కొండయ్యపడాల్, డిఆర్‌డిఏ పి.డి. వి.మురళి, ఎల్‌డి. ఎం.రవిబాబు, కాఫీ ఎడి అశోక్, గురుకులం ప్రిన్సిపాల్ మూర్తి, జి.మాడుగుల, పాడేరు, హుకుంపేట తహశీల్దార్లు అప్పలస్వామి, వి.త్రినాధరావు నాయుడు, రాజ్యలక్ష్మి, పలువురు జిల్లా, డివిజన్ స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు, వంతెనకు వినతి

ముంచింగిపుట్టు:- పాడేరు ఐటిడిఏ కార్యాలయం వద్ద స్పందనలో బర్రిగుడ జంక్షన్ నుండి ఉప్పెంగుల, దొరగుడ వరకు తారు రోడ్డు, వంతెన (బ్రిడ్జి) నిర్మాణంకు వినతి పత్రాన్ని లక్ష్మీపురం సర్పంచ్ కొర్ర త్రినాథ్ సమర్పించారు. లక్ష్మీపురం పంచాయతీ పరిధిలో గల గ్రామాలలో తక్షణమే రోడ్డు నిర్మాణ పనులకు అధికారులు వేగవంతం చేసి ప్రజాలకు సిద్ధం చేయాలని అధికారులను కోరారు. అత్యవసర వైద్య సేవలకు రవాణా, బ్రిడ్జి నిర్మాణాలు లేక అనేక మంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు.ఈ కార్యక్రమంలో బిరిగూడ ఉబెంగుల దొరగూడ గ్రామస్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతల ఆందోళన

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:అసంపూర్తిగా ఉన్న మండలంలోని కోర్రాయి పంచాయతీ జాంగూడ వంతెనను పూర్తిగా నిర్మించాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర పిసిసి కమిటీ సభ్యుడు పి చిన్నస్వామి ఆధ్వర్యంలో శుక్రవారం గిరిజనులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వంతెన నిర్మాణ పనులు చేపట్టి సుమారు నాలుగేళ్లు గడుస్తున్నప్పటికీ పునాది దశలోనే ఉందన్నారు. దీంతో వర్షాలు కురిసినప్పుడు ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, జీపులు రవాణకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పంచాయతీ గ్రామాల్లో 108 అంబులెన్స్ కూడా వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతుందని చెప్పారు. తక్షణమే వంతెనను పూర్తిచేయాలని, లేనిపక్షంలో ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి భీమరావు, కె.శంకరం, జె.వెంకట్ బాబు, గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి నెబులైజర్ల పంపిణీ

ప్రజాశక్తి-పాడేరు: అమెరికన్ ఇండియా ఫౌండేషన్ మాన్వీ సరఫరా చేసిన నెబులైజర్లను ఐటిడిఏ పిఓ వి.అభిషేక్, చేతుల మీదుగా వైద్య సిబ్బంది ఎం.ఎల్.హెచ్.పి (మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్) లకు శుక్రవారం ఐటిడిఏ సమావేశ మందిరంలో పంపిణీ చేసారు. హుకుంపేట మండలానికి చెందిన 15 మందికి నెబులైజర్లను పంపిణీ చేయడం జరిగిందని పిఓ చెప్పారు. నెబులైజర్ల సహాయంతో చిన్నారులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని పిఓ సూచించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారి వి.ఎస్. ప్రభాకరరావు, ఆర్డీఓ పి.అంబేద్కర్, ఎస్.డి.సి.వి. వి.ఎస్. శర్మ, జిల్లా వైద్యాధికారి జమాల్ భాషా, అమెరికన్ ఇండియా ఫౌండేషన్ స్టేట్ ప్రోగ్రాం మేనేజర్, పి.శ్రీకృష్ణ పాల్గొన్నారు.

అసిస్టెంట్ ఇంజనీర్‌గా గౌరీ శంకర్

ప్రజాశక్తి -హుకుంపేట: హౌసింగ్ వర్క్ ఇన్స్పెక్టర్‌గా మండలంలో గత కొద్ది సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న గౌరీ శంకర్‌రావు అసిస్టెంట్ ఇంజనీరింగ్ ఉద్యోగోన్నతి పొందారు. శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గృహ నిర్మాణాల లబ్దిదారులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. మండలంలోని 582 గృహాలు మంజూరు కాగా 78 ఇళ్లు పూర్తి చేశారన్నారు. నిర్మాణం చేపట్టిన లబ్దిదారులకు ఖాతాలోని బిల్లులు జమ అవుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డీఈవో బి.భాను ప్రకాష్ సిబ్బంది పాల్గొన్నారు.

‘ఉపాధి’ కూలీల పిల్లలకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి పాడేరు:జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో వంద రోజులు పని దినాలు పూర్తి చేసిన వారి పిల్లలకు ఉన్నతి ప్రాజెక్ట్ ద్వారా ఉపాధి శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఏపీడీ జె.గిరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2018 -2023 ఆర్థిక సంవత్సరంలో 100 రోజులు పని దినాలు పూర్తిచేసిన కుటుంబాల యువతీ యువకులకు ఉన్నతి కార్యక్రమం ద్వారా ఉచిత ఉపాధి శిక్షణకు ఈనెల 4న సోమవారం పాడేరు వెలుగు కార్యాలయంలో జాబ్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చదువుకొని ఖాళీగా ఉన్న యువతీ, యువకులకు మూడు నెలల పాటు కంప్యూటర్స్, మెకానిక్, ప్లంబింగ్, ఎలక్ట్రానిక్స్, హార్డ్వేర్ సాఫ్ట్వేర్, ఫార్మా వంటి కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణకు 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటిఐ డిప్లమా, బిటెక్ అర్హత కలిగి ఉండాలని, వయసు 18 సంవత్సరాల నుండి 35 సంవత్సరాలు ఉండాలన్నారు. శిక్షణ కాలంలో యూనిఫామ్, షు, ఐడెంటి కార్డు ఇస్తామన్నారు. శిక్షణ కాలంలో ప్రతిరోజు మెయిన్ డిష్ ప్రకారం రోజుకు రూ. 272 ఇస్తారని చెప్పారు. మంచంగిపుట్, పెదబయలు మండలాలకు సంబంధించిన అభ్యర్థులు ఈనెల 6న పెదబయలు వెలుగు కార్యాలయం, డుంబ్రిగుడ, అరకువేలీ, అనంతగిరి మండలాలకు సంబంధించిన వారు ఈనెల 8న అరకు లోయ వెలుగు కార్యాలయం, చింతపల్లి, జి.కె వీధి,కొయ్యూరు మండలాలకు సంబంధించిన వారు ఈనెల 11న చింతపల్లి వెలుగు కార్యాలయంలో హాజరు కావాలని సూచించారు.

పౌష్టికాహార వారోత్సవాలు

ప్రజాశక్తి - హుకుంపేట: మండలంలోని తాడిపుట్టు గ్రామపంచాయతీ ఐసిడిఎస్ శాఖ సిడిపిఓ సిహెచ్ బాలమణి దేవి, సర్పంచ్ కుమారి సోమేలి సత్యవతి సిబ్బంది కలిసి పోషణ పౌష్టికాహారం మహోత్సవం ప్రాజెక్ట్ ద్వారా అంగన్వాడీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న సర్పంచ్ సోమేలి సత్యవతి మాట్లాడుతూ. గ్రామపంచాయతీలో గర్భిణీలు బాలింతలు పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలని, పిల్లలకు తగు జాగ్రత్తలు పాటించాలని ఆమె అన్నారు. అనంతరం అంగన్వాడి మినీ ఆయా పదవి విరమణ పొందిన కాసులమ్మను సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు హైమావతి, ఉషారాణి, సీనియర్ అసిస్టెంట్ భవాని, అంగన్వాడి టీచర్స్ బి సుధారాణి, ఉషారాణి, రేవతి ,లక్ష్మి , పాల్గొన్నారు.

‘విజయసాయిరెడ్డి అక్రమాలకు అంతే లేదు’

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : వేల కోట్ల రూపాయల విలువచేసే వివాదాస్పద దసపల్లా భూములను కొట్టేసిన రాజ్యసభ సభ్యుడు వి.విజయిసాయిరెడ్డి అక్రమాలకు అంతే లేకుండా పోతుందని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ ఆరోపించారు. ఒక హోటల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అనకాపల్లి జిల్లా కశింకోట మండలం విస్సన్నపేటలో వేసిన వివాదాస్పద లే-అవుట్‌లో 60 ఎకరాలను బహుమతిగా పొందిన విజయసాయిరెడ్డి మధురవాడ శ్రీరామ్ ప్రాపర్టీస్ ఎదురుగా ఉన్న ఐకానికా ప్రాజెక్ట్స్ స్థలంలో రూ.100 కోట్లతో తన కుమార్తె నేహా రెడ్డికి 5076 గజాల్లో అత్యంత విలాసమైన విల్లాన్ని కడుతున్నారని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం జరుగుతున్నా జివిఎంసి అధికారులు ఎవరూ కన్నెత్తి చూడటం లేదన్నారు. నిర్మాణం పూర్తి కాకపోయినా, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ తో సంబంధం లేకుండానే ఆస్తి పన్ను విధించారని పేర్కొన్నారు. ప్రభుత్వ భూములు, ఆస్తులను కొల్లగట్టిన విజయసాయిరెడ్డి వ్యవహారాలపై సిబిఐ, ఈడి దృష్టి సారించి విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

పర్యావరణహిత వినాయక ఉత్సవాలకు ప్రణాళికలు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : పర్యావరణహిత వినాయక ఉత్సవాలు జరుపుకోవాలని నగర ప్రజలకు జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్‌వర్మ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన జివిఎంసి ప్రధాన కార్యాలయంలో నివాస సంక్షేమ సంఘం సభ్యులు, ఎన్జీవోస్, స్వచ్ఛంద సంస్థలు, పలు ఉత్సవాల కమిటీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, పర్యావరణానికి హాని కలిగించే వినాయక ప్రతిమలు వాడకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, ఎస్ఆర్‌యు శ్రీనివాస్ రాజమణి, తదితరులు పాల్గొన్నారు.

కిరండూల్ రైలుకు అదనపు విస్టాడోమ్ కోచ్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ప్రయాణికుల అదనపు రద్దీని క్లియర్ చేయడానికి విశాఖపట్నం-కిరండూల్-విశాఖపట్నం రైలుకు అదనపు విస్టాడోమ్ కోచ్‌ను జోడించాలని తూర్పు కోస్తా రైల్వేలోని వాల్తేరు డివిజన్ నిర్ణయించింది. విశాఖపట్నం-కిరండూల్‌కు ఈ నెల 2, 3 తేదీల్లో, కిరండూల్-విశాఖపట్నం రైలుకు 3,4 తేదీల్లో అదనపు విస్టాడోమ్ అందుబాటులో ఉంటుందని అధికారులు తెలిపారు.

జాతీయ పోషకాహార వారోత్సవాలు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : మంచి పోషకాహారం, ఆరోగ్యం గురించి అవగాహన కలిగించుటకు సెప్టెంబరు 1 నుంచి 7వ తేదీ వరకు జాతీయ పోషకాహార వారోత్సవాల ను జరుపుకుంటారని డిపిఎంపి అసోసియేషన్ ఆఫ్ ఇండియా విశాఖ శాఖ కన్వీనర్, సామాజిక ప్రజా వైద్యులు డాక్టర్ కుప్పిలి సురేష్‌బాబు తెలిపారు. దేశ సమగ్రాభివృద్ధిలో పోషకాహార లోపం ఒక ప్రధాన అడ్డంకిగా ఉందని పేర్కొన్నారు. సమతుల్య ఆహారము అనగా తృణ ధాన్యాలు, పండ్లు, కాయగూరలు, పాలు, తదితరాలతో కూడిన పోషకాహారం తీసుకోవాలని తెలిపారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి

ప్రజాశక్తి-వేపగుంట : గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరైన నిధులతో చేపట్టిన పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి అన్నంరెడ్డి అజయ్‌రాజ్ అన్నారు.శుక్రవారం 93వ వార్డు పరిధిలో చేపడుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎమ్మెల్యే అదీప్‌రాజ్ గడపగడపకు పర్యటనలో వచ్చిన వినతుల మేరకు ఆరు పనులు మంజూరుకాగా, ఐదు పూర్తయ్యాయన్నారు. కార్యక్రమంలో 94వ వార్డు వైసిపి అధ్యక్షుడు ఆదిరెడ్డి మురళీ, 93వ వార్డు అధ్యక్షులు దాసరి అన్నపూర్ణ, వైసిపి వార్డు గౌరవాధ్యక్షుడుబంటు సత్తిబాబు,దాసరి సత్తిబాబు, శ్రీకాంత్,నిర్మల, సచివాలయ సిబ్బంది సంతోష్, ఝాన్సీ, అప్పలరాజు పాల్గొన్నారు.

వృద్ధులకు వస్త్రాలు, పండ్లు పంపిణీ

ప్రజాశక్తి- వేపగుంట : నగర డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం పట్టాభి గార్డెన్స్ వానప్రస్థ వృద్ధాశ్రమం వృద్ధులకు చీరలు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం వృద్ధులకు ఆహారాన్ని అందించి, వారితో కలిసి భోజనం చేశారు. వృద్ధుల ఆలనాపాలన చూస్తూ, వారి అవసరాలకు తగ్గట్టుగా సంరక్షిస్తున్న వానప్రస్థ ఆశ్రమ నిర్వాహకులు నివాస్‌ను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో జియ్యాని విజయ్, జియ్యాని మారుతి, వేదుల్ల శ్రీనివాసరావు, కంచిపాటి వెంకటరమణ, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

నిరంతర సాధనతోనే పోటీ పరీక్షల్లో విజయం



మాట్లాడుతున్న యుపిఎస్‌సి టాప్ ర్యాంకర్ డాక్టర్ రాణి సుస్మిత

ప్రజాశక్తి- మధురవాడ : నిరంతర సాధన, ప్రణాళికాయుతంగా లక్ష్యాన్ని చేరడం ద్వారా పోటీ పరీక్షలలో విజయం సాధించవచ్చునని 2022 పబ్లిక్ సర్వీస్ కమిషన్ టాప్ ర్యాంకర్, విజయవాడ డిప్యూటీ కలెక్టర్. యుపిఎస్‌సి విజేత డాక్టర్ రాణి సుస్మిత అన్నారు. శుక్రవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం కెరీర్ గైడెన్స్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ, .ప్రతి విద్యార్థికి జీవితంలో ఏదైనా సాధించాలన్న లక్ష్యం ఉండాలని అది సాధించడానికి ప్రణాళికాయుత కషి జరపాలని సూచించారు. సివిల్ సర్వీస్ వంటి అత్యున్నత పోటీ పరీక్షల్లో విజయం సాధించడానికి నిరంతర సాధనే కీలకమన్నారు వ్యక్తిగత ప్రతిభను గుర్తించి వెలికితీసుకొచ్చే బాధ్యత ఎవరికి వారే తీసుకోవాలన్నారు. సివిల్స్, ఇతరత్రా పోటీ పరీక్షలలో విజయానికి విషయపరిజ్ఞానంతో పాటు సందర్భోచితంగా విశ్లేషణాత్మకంగా ఆలోచించడం నేర్చుకోవాలన్నారు. విద్యార్థులు తాము ఎంచుకున్న సబ్జెక్టులో లోతైన పరిజ్ఞానాన్ని పెంచుకోవడం, ప్రణాళికాయుతంగా అధ్యయనం చేయడం, లక్ష్యసాధనకు నిరంతర కషి చేయడం ద్వారా ఏ రంగంలో అయినా రాణించడానికి దోహదపడుతుందన్నారు.. కార్యక్రమంలో గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ అదర్ కెరీర్ అప్షన్స్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ బి.రవికాంత్ పాల్గొన్నారు. విద్యార్థుల సందేహాలను నివృతి చేసి, ప్రశ్నలకు సమాధానమిచ్చారు.

‘ఆర్గానిక్’ కూరగాయల సేకరణ

ప్రజాశక్తి -ఆనందపురం: మండలంలోని పాలవలస గ్రామంలో ప్రకృతి వ్యవసాయ విధానంలో పండించిన కూరగాయలను అవని ఆర్గానిక్ సిబ్బంది సేకరించారు.పాలవలస గ్రామంలో రైతులతో అవని ఆర్గానిక్స్ కుదుర్చుకున్న ఒప్పందం మేరకు పది మంది రైతుల్లో నలుగురు పండించిన గోంగూర, ఎర్రతోటకూర, తెల్లతోటకూర, అనప, బరబాటీ, బొప్పాయి, అరటికాయలను సేకరించి తర్లువాడలోని అవని ఆర్గానిక్స్ గోడౌన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో నేచురల్ ఫార్మింగ్ అధికారి వనజ మాట్లాడుతూ, ఆర్గానిక్ పద్ధతిలో పండించే కూరగాయలు ఆరోగ్యానికి మేలు చేస్తాయన్నారు రైతులు రసాయనిక పదార్ధాలను విడిచి నేచురల్ పద్ధతిలో కూరగాయలను పండించాలన్నారు అవని ఆర్గానిక్ సంస్థ తరపున రైతులకు తగిన ప్రోత్సాహం అందిస్తున్నామన్నారు. మరింత మంది రైతులు నేచురల్ ఫార్మింగ్ పద్ధతులలో పండించాలన్నారు ఎంఎ. రామారావు, ఐసిపిఎస్ సాయి లక్ష్మీ, నాగమణి పాల్గొన్నారు



రైతుల నుండి కూరగాయలను సేకరిస్తున్న అవని ఆర్గానిక్ సిబ్బంది

ల్యాండ్ పూలింగ్ నిర్వాసితులకు నయవంచన

నాలుగున్నరేళ్లవుతున్నా కేటాయించని స్థలాలు

సిపిఎం ఆధ్వర్యాన బాధిత రైతుల వంటావార్పు

4న తహశీల్దార్ కార్యాలయ ముట్టడికి హెచ్చరిక

ప్రజాశక్తి-పద్మనాభం: ల్యాండ్ పూలింగ్ పేరుతో పేద నిర్వాసిత రైతులను రాష్ట్ర ప్రభుత్వం దగా చేసి మోసపుచ్చిందని సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మండిపడ్డారు. భూసేకరణ తర్వాత రైతులకు ఇవ్వాల్సిన జాగాల పంపిణీలో చేతివాటం చూపడంతోపాటు జాప్యాన్ని నిరసిస్తూ శుక్రవారం నర్సాపురం లేఅవుట్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో వంటావార్పు, ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం తక్షణం స్పందించకుంటే ఈనెల 4న తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా గంగారావు మాట్లాడుతూ, తునివలస పంచాయతీ నర్సాపురం గ్రామానికి చెందిన సర్వే నెంబర్ 74, 76, 91లలో 190 ఎకరాలు భూమిని 2019లో 110 రైతుల నుంచి సేకరించిందన్నారు. ఈ సందర్భంగా నర్సాపురం పాఠశాల వద్ద అప్పట్లో నిర్వహించిన గ్రామసభలో జిరాయితీ రైతులకు ఎకరాకు 900గజాలు, ఏ ఆధారంలేని రైతులకు 450గజాల ప్లాట్లు చెల్లింపునకు ఒప్పందం కుదిరిందన్నారు. అప్పట్లో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుతోపాటు స్థానిక నేతల మాటలను నమ్మి రైతులు మూకుమ్మడి ల్యాండ్‌పూలింగ్‌కు తమ భూములిచ్చారని, అయితే నాలుగున్నరేళ్లు గడిచినా నిర్వాసిత రైతులకు స్థలాల కేటాయింపు జరగలేదన్నారు. చేసుకున్న ఒప్పందం ప్రకారం రైతులకు స్థలాల ఇవ్వని ప్రభుత్వం, మరోవైపు రైతుల నుంచి సేకరించిన భూముల్లో 7,500మందికి పట్టాలిచ్చే పనులు మాత్రం చురుగ్గా చేయడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వం, స్థానిక నేతల మాటలను నమ్మి మోసపోయిన రైతులకు న్యాయం చేసేవరకు సిపిఎం పోరాటం చేస్తుందన్నారు. భూములిచ్చిన నిర్వాసిత రైతులకు స్థలాల కేటాయింపులో అన్యాయం చేస్తున్నారని, బినామీలంతా మంచి స్థలాలను ఎంచుకుని, మిగిలిన ప్లాట్లను రైతులకు కట్టబెట్టాలని చూస్తున్నారని మండిపడ్డారు. దీనిపై సోమవారం తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నేతలు ఆర్ఎస్ఎస్ మూర్తి, రైతులు ఎం అప్పలనాయుడు, ఎస్ సన్యాసిరావు పాల్గొన్నారు.

ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిన వెంటనే ఎల్‌సిలు

నర్సాపురం లేఅవుటులో సిపిఎం ఆధ్వర్యంలో ల్యాండ్ పూలింగ్ నిర్వాసితుల వంటావార్పు ఆందోళన సమాచారం తెలుసుకున్న స్థానిక సిఐ ఎన్.సన్యాసినాయుడు నిరసన శిబిరం వద్దకు చేరుకుని సిపిఎం నేతలు గంగారావు, ఆర్ఎస్ఎన్.మూర్తి, రైతులతో చర్చించారు. అనంతరం తహశీల్దార్ తోట శ్రీవల్లికూడా అక్కడకు చేరుకుని రైతులతో మాట్లాడారు. స్థలాలు సిద్ధంగా ఉన్నాయని, ప్రభుత్వం నుంచి అనుమతి రాగాలనే ఎల్‌సిలు అందజేస్తామన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి నాలుగో వార్డు మంగామారి పేట గోకార్డింగ్ గ్రౌండ్‌లో జన సేన పవర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ శుక్రవారంతో ముగిసింది. జన సేన అధినేత పవన్ కల్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా వారం రోజులుగా నియోజక వర్గ స్థాయి క్రికెట్ పోటీలు జరిగాయి. శుక్రవారం జరిగిన ఫైనల్ పోటీలో ఆనందపురం జట్టును ఓడించి, జివిఎంసి నాలుగోవార్డు జట్టు విజేతగా నిలిచి ట్రోఫీని అందుకుంది. మధురవాడ బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షులు టోర్నమెంట్ నిర్వాహక కమిటీ చైర్మన్, జనసేన జిల్లా నాయకులు శ్రీధర్ ఆర్థిక సహకారంతో టోర్నమెంట్ నిర్వహించారు విజేత నాల్గో వార్డు జట్టుకు రూ 20 వేలు, రన్నరప్ ఆనందపురానికి రూ 10 వేలు నగదు తో పాటు ట్రోఫీని పార్టీ నియోజక వర్గ ఇంఛార్జి పంచకర్ల సందీప్ అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఇఎన్ఎస్ చంద్రరావు, కృష్ణయ్య, శ్రీనివాస్, కెప్టెన్లు బాలు, సురేష్ పాల్గొన్నారు

తెలుగు పద్యాన్ని పరిరక్షించుకుందాం

ప్రజాశక్తి- సీతమ్మధార : పద్యం తెలుగువారి సాంస్కృతిక ఆస్తి అని, దానిని కాపాడి భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రపంచంలోని తెలుగువారి అందరిపైనా ఉందని ప్రముఖ పద్య శిక్షకులు కొల్లారపు ప్రకాశరావుశర్మ అన్నారు, అమెరికా సంయుక్త రాష్ట్రాలలో స్థిరపడిన ఆయన, విశాఖ సాహితి ఆహ్వానం మేరకు ‘ప్రాచీన పద్య కవిత నుండి ఆధునిక పద్య కవిత రచన వరకు’ అనే అంశంపై ప్రసంగించారు, అమెరికా సంయుక్త రాష్ట్రాల నుండే నిత్యం ఇంటర్నెట్ ద్వారా ఎంతో మందికి పద్య రచనలో శిక్షణను ఇస్తున్నామని, ఈ అవకాశాన్ని తెలుగు ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు, విశాఖ సాహితీ అధ్యక్షురాలు ఆచార్య కోలవెన్ను మలయవాసిని మాట్లాడుతూ అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో స్థిరపడినప్పటికీ కొల్లారపు ప్రకాశరావు శర్మగ్గా తెలుగు సాహిత్యంపై వున్న అభిమానంతో పద్యానికి పూర్వవైభవం తీసుకురావడానికి కృషి చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో విశాఖ సాహితి ఉపాధ్యక్షురాలు డాక్టర్ కందాళ కనకమహాలక్ష్మి కార్యదర్శి శంకర్‌నీలు భాగవతుల పాల్గొన్నారు, కార్యక్రమానికి సమన్వయకర్తగా వేదుల కామేశ్వర శర్మ, కొచ్చర్లకోట సత్యనారాయణమూర్తి వ్యవహరించారు

చట్టాలకు హిందీ పేర్లు సరికాదు

ప్రజాశక్తి- విశాఖ లీగల్ : దేశంలోని క్రిమినల్ చట్టాలైన ఇండియన్ పీనల్ కోడ్, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ పేర్లను హిందీ ప్రిఫిక్స్ భారతీయ నాగ్రిక్ లేదా సంహితతో ప్రిఫిక్స్ చేయడానికి అనుమతించడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 348ని పూర్తిగా ఉల్లంఘించడమేననిసీనియర్ న్యాయవాది, న్యాయ నిపుణుల ప్రెసిడెంట్ ఫోరమ్ కుప్పిలి మురళీధర్ అన్నారు. దేశంలో 16 కంటే ఎక్కువ రాష్ట్రాల్లో ముఖ్యంగా ఉత్తర, తూర్పు రాష్ట్రాల్లో ప్రజలు హిందీ మాట్లాడడం, అర్థం చేసుకోలేరన్నారు. అధికార భాషా చట్టం 1963కు వ్యతిరేకంగా ఉన్న విస్తారమైన జనాభాపై హిందీని రుద్దాలనుకోవడం, కేంద్ర, రాష్ట్ర శాసనసభలచే రూపొందించబడిన అన్ని చట్టాలు,శాసనాలు ఆంగ్ల భాషను తప్పనిసరిగా అనుసరించాలన్నారు. జాతీయ చట్టాలకు హిందీ పేర్లను ఉపయోగించడం సరికాదన్నారు.

నేత్రదానంపై వక్తృత్వ పోటీలు

ప్రజాశక్తి- సీతమ్మధార:జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు పురస్కరించుకుని జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ పి విశ్వమిత్ర ఆధ్వర్యంలో సిఐఐ యంగ్ ఇండియన్స్ ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆసుపత్రితో కలిసి విద్యార్థులకు నేత్రదానం ఆవశ్యకతపై వక్తృత్వ పోటీలను నిర్వహించారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థుల సృజనాత్మకతకను సీఐఐ యంగ్ ఇండియన్స్ డాక్టర్ త్రిప్తి యెరమిల్లి, రాయ్ కొడాలి మెచ్చుకున్నారు. నేత్రదానం ప్రాముఖ్యతను విపులంగా వివరించారు.అలాగే ఆకాశవాణిలో నేత్రదానం ఆవశ్యకతపై డాక్టర్ పి.విశ్వామిత్ర శ్రోతలకు అర్థమయ్యేలా మాట్లాడారు. ఈ కార్యక్రమం శనివారం ఉదయం ఆకాశవాణి ఆరోగ్యమే మహాభాగ్యం కార్యక్రమంలో ఉదయం 7:15 గంటలకు ప్రసారమౌతుందని ఆల్ ఇండియా రేడియో ప్రతినిధి సూర్య ప్రకాష్ తెలిపారు.

ఘనంగా విజయబాబు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- మాధవధార :ఉత్తర నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి చిక్కాల విజయబాబు జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. విజయబాబునున 51వ వార్డు తెలుగుదేశం పార్టీ నేత సనపల కీర్తి ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. టిడిపి నేతలు జయరాజ్, బొడ్డేపల్లి లలిత, మూల అప్పారావు, పేడాడ మధుసూదన్ రావు పాల్గొన్నారు.